ప్రజాశక్తి

శుక్రవారం 26 సెప్టెంబరు, 2025

ఆర్ఆర్‌బి, గ్రూప్-డి అభ్యర్థులకు 28న మాక్ టెస్ట్

శ్రీకాకుళం సిటీ: ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఉద్యోగార్థులకు ఉపయోగపడేలా మరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఆర్‌బి, గ్రూప్-డి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం మాక్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీన నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డులోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. https://www.yvssrikakulam.live/register ద్వారా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఈ మాక్ టెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆకాంక్షించారు.

మూడు శంకుస్థాపనలు... ఆరు ప్రారంభోత్సవాలు

జిల్లాకు కేంద్ర కేబినెట్ నుంచి ఒకరు, రాష్ట్ర మంత్రివర్గంలో మరొకరు ప్రాతినిధ్యం వహిస్తున్నా, ఏడాది కాలంగా జిల్లా అభివృద్ధిపై ఒక్క అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. వంశధార ఫేజ్-2 స్టేజ్-2, వంశధార - నాగావళి నదుల అనుసంధానం పనులు టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన నాటికే చివరి దశకు చేరాయి. వారు తలుచుకుంటే ఈసరికే అవి రైతులకు అందుబాటులోకి వచ్చేవి. జిల్లాకు వస్తున్న ప్రతిసారీ ఇద్దరు మంత్రులూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతోనే సరిపెడుతున్నారు తప్ప ప్రగతి సమీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, జీడి పిక్కలకు మద్దతు ధర తదితర అంశాలపై ఇచ్చిన హామీలను వదిలేసి, కార్గో ఎయిర్‌పోర్టుపై ఎనలేని ఉత్సుకత చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- జిల్లా అభివృద్ధిపై దృష్టిసారించని ఇరువురు మంత్రులు
- జిల్లాస్థాయి సమీక్షలు, సమావేశాలకు దూరం
- ఏడాది గడిచినా నేటికీ పూర్తి కాని సాగునీటి ప్రాజెక్టులు
- ప్రజలకు ఇచ్చిన హామీనుల వదిలేసి కార్గో ఎయిర్‌పోర్టుపై ఉత్సుకత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి రంగం చాలా దారుణంగా ఉంది. ప్రధానంగా వంశధార ఫేజ్-2 స్టేజ్-2 పనులు దాదాపు 90 శాతం మేర పూర్తయ్యాయి. మిగలిన పది శాతం ఆరు నెలల్లోపే పూర్తి చేసేయెుచ్చు. పనులు పూర్తయితే 1,94,628 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరిగేది. ఏడాది గడిచినా పూర్తి కాలేదు. 2026 నాటికి సాగునీరు అందిస్తామని ప్రభుత్వం చెప్తోంది. వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు టిడిపి హయాంలో 2017లో పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 20 శాతం పనులు పూర్తయితే ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని ఐదు వేల ఎకరాలకు సాగునీరు, నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరిగే అవకాశం ఉండేది. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే పంటలు పండి రైతుల ఆదాయం వృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది. రైతుల ఆదాయం పెరిగితే వారి తలసరి ఆదాయం, జిల్లా స్థూల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా అది జిల్లా అభివృద్ధికి దోహదపడుతుంది. వీటిని వదిలేసి ఎయిర్‌పోర్టు తోనే జిల్లా అభివృద్ధి జరిగిపోతుందన్నట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

కేంద్రమంత్రి ఉన్నా దక్కని ప్రయోజనం

వంశధార ఎడమ కాలువ దుస్థితి దయనీయంగా ఉంది. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండడంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు ఉంటున్నా, కాలువ గట్ల పరిస్థితి బాగా లేకపోవడంతో సామర్థ్యం మేరకు నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కొన్నిచోట్ల గండి పడిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. ఇటువంటి ప్రాజెక్టులకు సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో సపోర్టు ఫర్ ఇరిగేషన్ మోడర్నైజేషన్ ప్రోగ్రామ్‌ను రూపొందించింది. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థికసాయాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) అందించాలని నిర్ణయించింది. దీనిపై వంశధార అధికారులు 2021 జనవరిలో రూ.785.32 కోట్ల అంచనాలతో నివేదికలు పంపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన పలుకుబడితో కేంద్ర జలశక్తి మంత్రిని ఒప్పించి ఉంటే, నిధుల్లేక ఏళ్ల తరబడి నిలిచిపోయిన పనులకు సాయం అందేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైంటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు (ఫైల్)

ఐటిడిఎ ఏర్పాటుపై ఏదీ చొరవ

జిల్లాల పునర్విభజనకు ముందు సీతంపేట ఐటిడిఎ కేంద్రంగా గిరిజనులకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యేవి. ఆదివాసీల సమస్యలూ పరిష్కారమయ్యేవి. జిల్లాల పునర్విభజన తర్వాత ఇక్కడి గిరిజనుల సమస్యలు వినే దిక్కే లేకుండా పోయింది. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ గిరిజనులు చేస్తున్న ఆందోళనలు అరణ్యరోదనగానే మిగిలాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నం సభలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా, ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఒకట్రెండు పర్యాయాలు పాతపట్నంలో పర్యటించిన సందర్భంలో, ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు గానీ అందుకు సంబంధిం చిన కార్యాచరణ ఏదీ ఇప్పటివరకు చేపట్టలేదు. ఐటిడిఎల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశం నేపథ్యంలో కేంద్రమంత్రిగా ఎంతమేరకు చొరవ చూపారన్నది సందేహంగానే ఉంది.

జీడి పంటకు మద్దతు ధరపై ఏదీ శ్రద్ధ?

జీడిపిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, ప్రభుత్వమే వీటిని కొనుగోలు చేయాలని జీడి రైతులు చాలా ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే నాడు ఎన్నికల సమయంలో పలాస సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని హామీనిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పంట సీజన్ ముగిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేస్తారేమోనని రైతులు ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. అరసవల్లి రథసప్తమి వేడుకలు, కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి పండగలను రాష్ట్ర పండగలుగా ప్రభుత్వం గుర్తించే విషయంలో కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు... జీడి పిక్కలకు మద్దతు ధర, ప్రభుత్వపరంగా కొనుగోలు అంశాలపై ఎందుకు ప్రభుత్వాన్ని ఒప్పించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరి, గోధుమ, మొక్కజొన్న తదితర పంటలకు ఏటా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. జీడి పంటనూ మద్దతు ధరల జాబితాలో చేర్చి ఉంటే జిల్లా రైతులకు మేలు చేకూరేది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈరకమైన ప్రయత్నాలు చేసినట్లు ఎక్కడా కనిపించడం లేదు.

లారీ డ్రైవర్ ఘాతుకం

- బిల్లు కట్టమన్నందుకు దాబా యజమానిని లారీతో ఢీకొట్టిన వైనం
- అడ్డుకున్న వృద్ధుడి పైనుంచి వెళ్లిన లారీ
- ఇద్దరు మృతి

దండాసి మృతదేహం (ఇన్‌సెట్‌లో ఆయూబ్ (ఫైల్)

ప్రజాశక్తి - కంచిలి

దాబాలో తిన్న ఆహార పదార్థాలకు డబ్బులు ఇవ్వాలని అడిగిన దాబా యజమానిని లారీతో ఢీకొట్టి, అడ్డుకునేందుకు యత్నించిన వృద్ధుడినీ లారీతో తొక్కించిన అమానుష ఘటన కంచిలిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాబా యజమాని ఆయూబ్ (55), మండలంలోని మధుపురం గ్రామానికి చెందిన డొక్కారి దండాసి (65) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన ఆయూబ్ 15 ఏళ్లుగా మండలంలోని జలంత్రకోటలో జాతీయ రహదారి పక్కన దాబా నిర్వహిస్తున్నాడు. జార్ఖండ్‌లోని కొండేర్మ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్‌ఖాన్ విశాఖపట్నం వైపు కంటైనర్ లారీతో వెళ్తూ జలంత్రకోట వద్ద దాబా వద్ద బుధవారం రాత్రి భోజనానికి ఆపాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఇబ్రార్‌ఖాన్‌కు దాబాలో వేరే లారీ డ్రైవర్‌తో గొడవ కాగా, ఆయూబ్ జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. భోజనం చేసిన తర్వాత డబ్బులు ఇవ్వాలని అడగ్గా, ఇబ్రార్ ఆయూబ్‌తో గొడవకు దిగాడు. డబ్బులు ఇవ్వకుండా లారీ ఎక్కి వెళ్ళిపోతుండగా, అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయూబ్‌ను లారీతో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అది చూసిన దండాసి లారీని ఆపేందుకు ఎదురుగా వెళ్లగా, ఆయన్నూ ఢీకొట్టి వెళ్లడంతో కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు లారీని ఆపేందుకు వెంబడించగా, సోంపేట మండలం బూరగాం సమీపంలో లారీని అడ్డగించి ఇబ్రార్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. అప్పటికే ఈ ప్రమాదంలో గాయపడిన వృద్ధుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో సోంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేసరికే మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడు ఆయూబ్‌కి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దండాసికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనాస్థలికి చేరుకున్న సిఐ మంగరాజు, ఎస్ఐ పారినాయుడు వివరాలను సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సిఐ మంగరాజు తెలిపారు.

ఉపాధి కోసం వచ్చి...

ఆయూబ్ 15 ఏళ్ల కిందట జార్ఖండ్ నుంచి వలస వచ్చి ఇక్కడ దాబా నిర్వహిస్తూ స్థిరపడ్డాడు. అతని సోదరులు కూడా సోంపేట పరిసర ప్రాంతాల్లో దాబా, హోటల్స్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయూబ్ భార్య నజీమా బేగం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో సోంపేట పట్టణ శివారులోని బిరుసువాడలో నివాసం ఉంటున్నాడు. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా, కుమారులు ఇద్దరూ తండ్రికి దాబా నిర్వహణలో సహాయం చేస్తున్నారు. లారీ డ్రైవర్ ఘాతుకానికి ఇంటి పెద్దను కోల్పోయిన అ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద రోదించిన తీరు అందరినీ కలచివేసింది.

అడ్డుకునేందుకు వెళ్లి...

డొక్కారి దండాసి దాబా, హోటళ్లకు పాలు పోస్తుంటాడు. పాల డబ్బుల కోసం బుధవారం రాత్రి వచ్చిన ఆయన, కళ్లెదుట జరిగిన ఘోరాన్ని ఆపేందుకు ప్రయత్నించి తాను మృత్యువాత పడ్డాడు. ఆయనకు భార్య శాంతమ్మతో పాటు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, పెద్ద కుమారుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు కంచిలి మండలం జలంత్రకోట సర్పంచ్‌గా ఉన్నాడు. అందరికీ సాయం చేస్తూ మంచి వ్యక్తిగా పేరుపొందిన దండాసి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోదిస్తున్న ఆయూబ్ కుటుంబసభ్యులు

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జల జీవన్ మిషన్ కింద జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిని వేగవంతం చేసి, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం, సోర్స్ ఉన్నచోట నుంచి వేరే ప్రాంతాలకు నీరు సరఫరా చేయడం, సోర్స్ లేని చోట కొత్త వాటిని నిర్మించడం ఇవే జిల్లాకు పెట్టుకున్న మూడు ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. జల జీవన్ మిషన్ కింద జిల్లాలో మొత్తం 4,286 పనులకు అనుమతి లభించగా, వాటి అంచనా వ్యయం రూ.2,076 కోట్లు ఉందని తెలిపారు. అందులో ఇప్పటివరకు 749 పనులు భౌతికంగా, 304 పనులు ఆర్థికంగా పూర్తయ్యాయన్నారు. మరో 1811 పనులు పలు దశల్లో కొనసాగుతున్నాయని, ఈ పనుల కోసం ఇప్పటికే రూ.825 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వివరించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల (ఎఫ్‌హెచ్‌టిసి) విషయంలో 4,95,064 లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 2,26,105 కనెక్షన్లు పూర్తయ్యాయని, ఇంకా 2,68,959 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించాలంటే ప్రతి గ్రామం వంద శాతం కుళాయి కనెక్షన్లను పొందాల్సి ఉంటుందని, ఈ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా సాధించడానికి అధికారులు కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు.

ఉద్దానం ఫేస్-1, 2 పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇంకా టెండర్ల దశలో ఒక్క పని కూడా పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. పనులు ప్రారంభించని చోట వెంటనే మొదలుపెట్టాలని, ప్రజలకు నిరంతర శుద్ధి చేసిన తాగునీటి సరఫరా అందజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, డయేరియా వంటి వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఇది గ్రామీణ ప్రజల జీవన నాణ్యత పెరగడమే కాకుండా, సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.నాగేశ్వరరావు, ఇఇ పి.శంకరబాబు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన కొత్తమ్మతల్లి జాతర

- కిలోమీటర్లు పొడవున పోటెత్తిన జన సందోహం
- ముగిసిన ఉత్సవాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక కొత్తమ్మతల్లి జాతర శతాబ్ది ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహించారు. ఈ ఉత్సావాలు చివరి రోజై గురువారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాలు సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు వేలాది సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. కొత్తపేట కూడలి నుంచి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్లు దారిపొడవునా ఇసుక పోస్తే రాలనంతాగా జనాలు తరలివచ్చారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు పలుచోట్ల వాహనాలను పార్కింగ్ చేయించారు. పగటి వేషాలు, కొయ్య డ్యాన్సులు అలరించాయి. స్థానిక రెడ్డిక వీధిలోని కమ్మకట్టు చిన్నఅప్పలస్వామి ఇంటి నుంచి అమ్మవారి జంగిడిని పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య తీసుకొచ్చారు. మహిళలు పసుపు కలశాలతో ఊరేగింపుగా వచ్చారు. మెయిన్ రోడ్డులో పోస్టాఫీసు ఆవరణలో రైసు మిల్లర్ల ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటు చేశారు. రెండు కిలోమీటర్లు పొడువున ఫుట్‌పాత్ దుకాణాలు వెలశాయి. ఈ సారి ఉత్సవాలకు ఎగ్జిబిష న్‌లోని జైంట్‌వీల్, శాంతారా, టోరాటోరా, సలంబో, బ్రేక్ డ్యాన్స్‌తో పాటు స్విమ్మింగ్, రైలు, బెలూన్ వంటివి చిన్న పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు.

కలశాలతో తరలివచ్చిన యాత్రికులు

తప్పిపోయిన చిన్నారి

ఈ ఉత్సవాల్లో ఓ కుటుంబానికి చెందిన చిన్నారి తన తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం గమనించిన అవుట్ పోస్టు పోలీసు సిబ్బంది అప్రమత్తమై చిన్నారిని సురక్షితంగా తమ వద్ద ఉంచారు. వెంటనే మైక్ ద్వారా ప్రచారం చేశారు. అనంతరం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అభినందించారు.

చిన్నారిని అప్పగిస్తున్న అవుట్‌పోస్టు పోలీసులు

కబడ్డీలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ప్రథమస్థానం

11 మంది సౌత్ జోన్‌కు ఎంపిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో ఈనెల 22, 23 తేదీల్లో కబడ్డీ, ఫెన్సింగ్ క్రీడా విభాగాలకు సంబంధించిన ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ఐటీ బాలురు, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ప్రతిభ ఆధారంగా, అక్టోబర్ 7వ తేదీన నిర్వహించే సౌత్ జోన్ క్రీడలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి తరుపున ఆరుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారు. విజేతలకు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ అభినందనలు తెలిపారు.

నేడు లోక్ కళ్యాణ్ మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వీధి వ్యాపారుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం స్వానిధి 2.0 పథకంలో భాగంగా లోక్ కళ్యాణ్ మేళాను ఈనెల 26వ తేదీన నగరంలోని రైతుబజారు వద్ద ఉన్న మహిళా మార్ట్ పై బిల్డింగ్‌లో ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వీధి వ్యాపారులకు రుణ మంజూరులు, పంపిణీ, డిజిటల్ ఎంపవర్‌మెంట్, వీధి వ్యాపారులకు శిక్షణ, సామాజిక, ఆర్థిక ప్రొఫైలింగ్, ఆరోగ్య శిబిరాలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీధి వ్యాపారులు పెద్దఎత్తున హాజరై, రుణ దరఖాస్తులు చేసుకోవడంతో పాటు తక్షణమే రుణ మంజూరులు పొందే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యర్థాలు నదుల్లో వేయొద్దు

- పరిశుభ్రతకు ప్రాధాన్యత
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆస్పత్రుల వ్యర్థాలు నాగావళి నదిలో వేయొద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛ ఉత్సవ్‌లో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంట్, ఏక్ సాథ్.. పేరుతో నగరంలోని డే అండ్ నైట్ సమీపంలో నాగావళి నది వంతెన ఇరువైపులా ఉన్న చెత్త, కాలువలోని పూడికల తొలగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వంతెన పరిసర ప్రాంతాల్లో ఆస్పత్రుల వ్యర్థాలు వేయడం వల్ల నదీజలాలు కలుషితమవు తున్నాయని, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రతపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వంతెన గోడలకు వైట్ వాష్ వేశారు. అనంతరం వంతెన వద్ద కలెక్టర్ మొక్కను నాటారు.

నగరాన్ని శుభ్రంగా, సుందరంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. చాపరం-2 సచివాలయం పరిధిలో డిసిసిబి కాలనీలో ప్రతి వీధిని, రామిగెడ్డ నుంచి డిసిసిబి కాలనీలోని కాలువలను పరిశీలించారు. రామిగెడ్డలో గుర్రపుడెక్కను తీసివేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పిఎస్ఎన్ఎం స్కూల్ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు కాలువలను పరిశీలించారు. కాలువల్లో పూడికలను దగ్గరుండి తీయించారు. కాలువల్లో మట్టి పేరుకుపోవటంతో వర్షం పడిన సమయంలో వర్షం నీరు రోడ్డు పైకి వస్తుందన్నారు. కాలువల్లో చెత్త వేయొద్దని చెప్పారు. నగరాన్ని ఆహ్లాదకరంగా ఉంచడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం డే అండ్ నైట్ వద్ద నిర్మిస్తున్న పింక్ టాయిలెట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, మున్సిపల్ హెల్త్ అధికారి సుధీర్, మున్సిపల్ ఇంజినీర్ బి.శ్రీనివాసులు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై సైకో గాడు అనే వ్యాఖ్యలను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజా సేవకుడిగా, ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ ఉపయోగించిన భాష, సంస్కారం చూస్తే ఆయన స్థాయి ఏంటో మరోసారి ప్రజలకు అర్థమైందన్నారు. నలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన ఎమ్మెల్యే ఇంతటి నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం బాధాకరమన్నారు. టిడిపి నాయకత్వం నిరాశను, దిగజారుడుతనాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని మండిపడ్డాడు. బాలకృష్ణ సొంత అవగాహనతో కాకుండా, టిడిపి అధినేత రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. జగన్ ఎప్పుడూ సినీ పరిశ్రమకు మద్దతుగానే నిలిచారని అన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కృష్ణదాస్

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT RAJAM.
E.A.01/2025 IN E.P.16/2017 IN O.S.79/2016

Between:-
Gummidi Venkatanaidu, ----Petitioner/ D.Hr
And:-
Nallapilli Chinnalakshmi ----Respondent/J.Dr.

To,
Nallapilli Chinnalakshmi, W/o Ganesh, aged 62 years, Hindu, Employee in Municipality, Srikakulam, Resident at D.No.9-9-89 in Dammala Veedhi, Srikakulam town and District.

Please take notice that the above matter stands posted on **06-10-2025** for your appearance before the court, therefore you are hereby directed to appear before the Honorable court on **06-10-2025 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence.

AMPOLU RAMBABU
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9959204121.

ఉపకరణాల ఎంపిక పరీక్షలు

ఎంఇఒకు షెడ్యూల్ అందజేస్తున్న ఐఇఆర్‌పిలు

ప్రజాశక్తి- రణస్థలం

6 నుంచి 18 ఏళ్ల మధ్య వికలాంగ చిన్నారులకు అలిమ్‌కో సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాల ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఐఇఆర్‌పిలు బాలరాజు, గౌరు మాధురి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఎ.త్రినాథరావుకు ప్రోగ్రాం షెడ్యూల్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి పరిధిలో ఉన్న రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లోని వికలాంగ చిన్నారులకు రణస్థలం హైస్కూల్ ఆవరణలో ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి ఉపకరణాల ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన వికలాంగ చిన్నారులకు సంబంధించిన డాక్యుమెంట్స్‌తో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9640861859, 9705927962 నంబర్లకు సంప్రదించాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డ్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, పాస్‌ఫోటో తీసుకుని రావాలన్నారు.

రామారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయ పరిషత్ నాయకులు

రామారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

హిందీ మంచ్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు సేవలు అభినందనియమని మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్ అన్నారు. జాతీయ హిందీ పక్షోత్సవం సందర్భంగా హిందీ మంచ్ విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో గురువారం జరిగిన హిందీ ఉత్సవంలో జాతీయ భాష హిందీ వికాసానికి చేస్తున్న కృషికిగాను రామారావును అతిథులు సత్కరించారు. ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, మంచ్ విజయనగరం జిల్లా అధ్యక్షురాలు పప్పు ఉమాబాల శాలువా కప్పి జ్ఞాపిక, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ హిందీ మంచ్ ద్వారా మున్ముందు హిందీ భాషా వికాసానికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా కాస్మోపాలిటన్ క్లబ్ కార్యదర్శి సురంగి మోహనరావు తదితరులు అభినందించారు.

మండపల్లి సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శేషమ్మ, సర్పంచ్

మండలంలోని మండపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయినట్లు వచ్చిన అభియోగాలపై సర్పంచ్ పిట్టా శేషమ్మ చెక్ పవర్ ఈ ఏడాది తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీనిపై సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందని సర్పంచ్ ప్రతినిధి పిట్టా మామయ్య కాపీని గురువారం విలేకరులకు చూపించారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు వైసిపి హయాంలో చేపట్టామని తెలిపారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని కొంతమంది వ్యక్తులు తప్పుడు అభియోగాలు మోపి చెక్‌పవర్ రద్దుచేయించారని ఆరోపించారు.

మందులను పంపిణీ చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మెళియాపుట్టిలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు అనపన రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యాన శ్రీకాకుళం జెమ్స్ సహకారంతో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పడ్డ, కొసమాల, చాపర నుంచి వచ్చిన 160 రోగులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేపట్టారు. బిపి, ఇసిజి, సుగర్ పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెమ్స్ మార్కెటింగ్ మేనేజర్ తిరుపతిరావు, నేత్ర వైద్యులు ఎ.విజయకుమార్, శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రవి, గణపతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'మాతృమూర్తి' అండ

ప్రజాశక్తి- కవిటి

పత్రికారంగం ప్రజా సమస్యల పరిష్కారానికి రాత్రింబవళ్లు శ్రమించే రంగం. ఆ రంగంలో తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ కరోనా మహమ్మారి వేళ కన్నుమూసిన ప్రజాశక్తి పాత్రికేయుడు బసవ జగన్. కానీ ఆయన మరణంతో ఆ కుటుంబం ఆర్థికంగా బలహీనమైపోయింది. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి కళ్లల్లో ఇప్పుడు అశ్రువులే మిగిలాయి. ఆ అశ్రువులను తుడవడానికి ముందుకొచ్చింది కుసుంపురం మాతృమూర్తి యువజన సంఘం. పాత్రికేయ మిత్రుల విజ్ఞప్తికి స్పందించిన మాతృమూర్తి సంఘం సభ్యులు పెద్దల సమక్షంలో బసవ జగన్ తల్లికి వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాతృమూర్తి సంఘం సభ్యులు మోహన్ దళాయి, అంగ సురేష్, పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, భావన రవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ఆమదాలవలస : పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గీత

వజ్రపుకొత్తూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు అన్నారు. దసరా ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని గరుడభద్ర పంచాయతీ పరిధిలోని గరుడభద్ర,టి గడూరు, హరిజాన పేట, మర్రిపాడు గ్రామాల్లో గురువారం చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్డుకి ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి వీధుల్లో, సచివాలయం చుట్టూ శుభ్రం చేయించారు.బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఫాగింగ్ మిషన్ సహాయంతో పొగ వేయించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.కృష్ణారావు, వార్డు సభ్యులు పి.పుష్పాలత, సిహెచ్.దనరాజ్, సిహెచ్.శేషగిరి, కె.వల్లభరావు, కె.శంకరరావు పాల్గొన్నారు.

కవిటి: సొండికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన కవిటి ప్రభుత్వాస్పత్రి డయాలసిస్ యూనిట్ పరిసరాల్లో గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ యూనిట్‌కు వెళ్లే మార్గం, డయాలసిస్ యూనిట్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ముళ్ల పొదలు, చెట్లు, తుప్పలు తొలగించారు. అదే విధంగా డయాలసిస్ రోగులకు సహాయంగా వచ్చేవారు, ఆస్పత్రికి వచ్చేవారి కోసం డయాలసిస్ యూనిట్ ప్రాంతంలో ఆరు విశ్రాంతి బల్లలు సొండికుల సంక్షేమ సంఘం ఆర్థికసాయంతో ఏర్పాటు చేశారు.

ఇచ్ఛాపురం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సురంగి రాజా క్రీడా మైదానంలో శ్రమదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్ వెంకటేష్, కార్యదర్శి కాదా రామకోటి పర్యవేక్షణలో క్రీడాకారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.దినేష్‌కుమార్, జోహర్‌ఖాన్, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, జోగారావు, గోపాల్, కౌన్సిలర్లు బచ్చు జగన్, టెంక లోకేష్, కె.రామారావు, గోపీచౌదరి, ఎల్.సి.రావు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లు కమిసనర్ నడిపిన రామారావు ఆధ్వర్యాన సచివాలయ సిబ్బందితో కలిసి గురువారం స్వచ్ఛతా హీసేవా కార్యక్రమం నిర్వహించారు. మెగిలిపాడు సచివాలయ పరిధిలో ప్రధాన కూడలి వద్ద, కాశీబుగ్గ పాతబస్టాండ్ ఆవరణలో, అన్ని వార్డులలో మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో శ్రమదానంతో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

అలాగే మండలంలోని గరుడఖండలో స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు అనిత చంద్రమౌళి, సాసుమాన హేమసుందర్, ఇచ్ఛాపురం సీతారాం, శ్రీను, బాబూరావు, నాని, నాగరాజు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఎంపిడిఒ నీరజ, ఎఒ బి.రాంబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం ప్రధాన రహదారి నుంచి పురపాలక సంఘ కార్యాలయం వరకు గల రహదారిని శుభ్రపరిచారు. అదేవిధంగా పురపాలక కార్యాలయ భవనంలోని అన్ని విభాగాల్లోనూ శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పట్టణ టిడిపి నాయకుడు మొదలవలస రమేష్, పాతిన రమణమూర్తి, మున్సిపల్, మెప్మా, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాలు, పబ్లిక్ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శ్రమదానం చేస్తున్న కమిషనర్ రమేష్, తదితరులు

బూర్జ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శశిధర్, ఎంపిడిఒ తిరుపతిరావు, సర్పంచ్ అనురాధ, ఎంపిటిసి పోలినాయుడు, కార్యదర్శి కిరణ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ రవీంద్రనాథ్ ఠాగూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలోని నెహ్రూ పార్కులో సర్పంచ్ రేగడి లక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలు తొలగించారు. స్వర్ణ అంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఎంపిటిసి ఎ.వాణి, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఇఒ కింతలి మోహన్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిన్నరంగ, వార్డు సభ్యులు మురళీ, బాల, కె.విజయ్‌కుమార్ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తో మురళీకృష్ణ

జగన్‌ను కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి- బూర్జ

మండలం డొంకలపర్త గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు వావిలపల్లి మురళీకృష్ణ మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఇటీవల మురళీకృష్ణను పంచాయతీ రాజ్ జాయింట్ సెక్రెటరీగా నియమించారు. ఈ సందర్భంగా జగన్‌ను మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

నూతన కార్యవర్గానికి సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం క్రెడాయ్ 2025 - 27 నూతన కార్యవర్గానికి జరిగిన ఎన్నికలు ప్రైవేట్ హోటల్లో గురువారం జరిగాయి. హాజరైన వైజాగ్ చాప్టర్ ప్రెసిడెంట్ అశోక్ క్రెడాయ్, స్టేట్ ప్రెసిడెంట్ బాయిన శ్రీనివాసరావు, క్లైస స్టేట్ చైర్మన్ ముని శ్రీనివాసరావు ఎన్నిక పర్యవేక్షించారు. శ్రీకాకుళం క్రెడాయ్ చాప్టర్‌కి ప్రెసిడెంట్‌గా పొట్నూరు రమేష్ చక్రవర్తి, సెక్రటరీగా అదీప్ రెడ్డి, చైర్మన్‌గా బెండి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్స్‌గా దుంగ సుధాకర రావు, కోరాడ సత్యారావు, గంజి భీమారావు, డోల వంశీ బాలకృష్ణ, ట్రెజరర్‌గా పృథ్వీరాజ్, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ముని శ్రీనివాసరావు, యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా పూజారి బాల చందర్, సెక్రటరీగా ఎన్ని జగదీష్, వైస్ ప్రెసిడెంట్‌గా లీలా మోహన్ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా వేదుల సంతోష్ కుమార్ తదితర సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అతిథులను క్రెడాయ్ సభ్యులను సత్కరించారు.

పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు, కూటమి నాయకులు

సోలార్‌తో విద్యుత్ బిల్లు ఆదా

ప్రజాశక్తి- పొందూరు

విద్యుత్ గృహ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చునని ఎంపిడిఒ ఎస్.వాసుదేశరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ శాఖ ఎఇ సుధీర్ ఆధ్వర్యంలో గురువారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లపై సోలార్ ఏర్పాటుకు అవసరమైన రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, దానికి ప్రతినెల ఇఎంఐ రూపంలో చెల్లించుకోవచ్చునని పేర్కొన్నారు. సోలార్ ఇన్‌స్టాలేషన్‌కు ఫీజు కూడా చెల్లించక్కర్లేదన్నారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం రమణమూర్తి, ఇఒ మోహన్‌బాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 28న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడ్ల చంద్రశేఖర్, మన్యాన వెంకటరావు తెలియజేశారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆరు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురుషుల విభాగంలో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, మహిళల విభాగంలో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు నేరుగా పోటీలకు హాజరుకావాలని కోరారు.

ఆర్‌టిసి బస్సు వేళల్లో మార్పు

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మండలంలోని బ్రాహ్మణతర్ల, కేశుపురం గ్రామాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సు వేళల్లో చిన్నపాటి మార్పులు చేపట్టామని మేనేజర్ ఎం.ఎస్.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ 4.30 గంటలకు పలాస నుంచి వెళ్లాల్సిన బస్సులు సాయంత్రం 5.15 గంటలకు వెళ్తుందన్నారు. ఇటీవల తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తికి బ్రాహ్మణతర్ల, కేశపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు 5.15 గంటలకు బస్సు నడపాలని కోరారు. తహశీల్దార్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతో బస్సు వేళలు మార్పు చేశారు.

కార్మికులను సన్మానిస్తున్న ఎంపిడిఒ తిరుపతిరావు

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో అన్ని గ్రామాల్లోనూ తమ సేవలను అందజేస్తున్న పారిశుధ్య కార్మికులకు గురువారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తిరుపతిరావు గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల వలనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. వారి సేవలు విలువ కట్టలేనివని, వారు అందించే సేవల వలన గ్రామాలు స్వచ్ఛంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విజయలక్ష్మితో పాటు సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా విద్యుత్ పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మునిభద్రలో తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. సర్పంచ్ చౌరవతో రూ.4 లక్షలు రాబట్టారు. సర్పంచ్ ప్రతినిధి లోహిదాస్ ఆధ్వర్యాన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సరఫరా సక్రమంగా అవుతుందని అన్నారు. బిసి సెల్ అధ్యక్షులుకోట రామారావు, లైన్‌మెన్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో భగవద్గీత పోటీలు

ప్రజాశక్తి- లావేరు

లావేరు శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు భగవద్గీత పోటీలను నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న మావూరి కీర్తికి ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థుల తల్లిదండ్రులు దసరా సెలవుల్లో వారి పిల్లలను గ్రంథాలయానికి పంపించడంతో వారికి రకరకాల పోటీలను గ్రంథాలయంలో నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అందిస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

'కగార్'కు వ్యతిరేకంగా పోరాడుదాం

సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పలాస: పైల చంద్రమ్మ ఆరు దశాబ్దాలు అవిరామంగా విప్లవోద్యమంలో ప్రజల తరపున పోరాడిందని, ఆమె స్ఫూర్తితో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడుదామని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. చంద్రమ్మ 5వ వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గ టికెఆర్ కళ్యాణ మండపంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన గురువారం సభ ఏర్పాటు చేశారు. సభ ప్రారంభానికి ముందుగా అరుణ పతాకాన్ని తాండ్ర ప్రకాష్ ఆవిష్కరించారు. అనంతరం చంద్రమ్మ చిత్రపటానికి పూలమాలను కమ్యూనిస్టు నాయకులు వంకల పాపయ్య వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులను, సహజ వనరులను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడానికి ఆపరేషన్ కగార్‌ను ప్రకటిస్తూ మతోన్మాద పాలకులు మావోయిస్టులను నిర్దాక్షిణ్యంగా పట్టుకొని కాల్చి చంపుతున్నారన్నారు. ఇది ఎక్కడ ప్రజాస్వామ్యమని, ఇది నియంత్రత్వ పాలన అని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజా సంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జె.వీరాస్వామి, ఎం.వినోద్, సవళాపురపు కృష్ణవేణి, బి.ఈశ్వరమ్మ, సార జగన్, ఎన్.నీలంరాజు, అరుణోదయ నాయకులు రామారావు, సోమేశ్వరరావు, ప్రజా కళా కారుడు కుత్తుం వినోద్ మాట్లాడారు. అరుణోదయ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సభను ఉత్తేజపరిచింది.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ సేవలను గ్రహించి అనుసరించాలని సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు డాక్టర్ ఎస్.శశిభూషణ్ సూచించారు. గురువారం పట్టణంలోని గేటు మున్సిపల్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అవసరాల పిల్లల పరికరాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాన్పూర్‌కు చెందిన అలింకో సంస్థ, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా అలింకో ప్రతినిధులు డాక్టర్ రంజాన్, అజిత్ ప్రత్యేక అవసరాల పిల్లలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్. వెంకటరావు, జిల్లా సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు, సహ సమన్వయకర్త వి.ఉమ, నాలుగు మండలాల ఎంఇఒలు టింగ రాజు, బి.ధనుంజయరావు, కె.శ్రీనివాసరావు, పి.రాజారావు, పాఠశాల హెచ్‌ఎం వై.లత, ఎంఆర్‌సి సిబ్బంది, నాలుగు మండలాలకు చెందిన సహిత ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న శశిభూషణ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

డొంకూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లో పాల్గొన్నారు. టి.వినీత అండర్-16 బాలికల విభాగం హైజంప్‌లో ప్రథమ స్థానం, డి.మీనా అండర్-16 బాలికల 600 మీటర్స్ పరుగు పందంలో ద్వితీయ స్థానం, బి.భరత్‌చంద్ర అండర్-14 బాలురు షాట్‌పుట్ విభాగంలో ద్వితీయ స్థానం, ఎస్.మాధవి అండర్-16 బాలికల పెంటథలోన్‌లో మొదటి స్థానం సాధించారు. ఎస్.రాంచరణ్ అండర్-16 బాలురు పెంటథలోన్ మొదటి స్థానం సాధించారు. వీరంతా ఈ నెల 27 నుంచి 28 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడామైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారు. వీరు ఎంపికపై ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి, విద్యా కమిటీ చైర్మన్ జె.జానకిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి సమీపంలోని ఐతమ్ కళాశాల ఇసిఇ విభాగ ఆచార్య బృందం డాక్టర్ మళ్ల జయమన్మథరావు, డాక్టర్ దాసరి యుగంధర్, డాక్టర్ కోడూరు శ్రీలక్ష్మి, శివశంకర్, రాజమణిలు విద్యార్థులకు ఉపయోగపడే ఎఐ ఉన్న టెక్నికల్స్‌కు సంబంధించిన బయో మెడికల్, సిగ్నల్ ప్రాసెసింగ్ పద్ధతులు, అనువర్తనాలు అనే పుస్తకాన్ని రచించారు. దీనిని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఎఐ యుగంలో సాంకేతిక అభివృద్ధికు కావాల్సిన అన్ని రంగాలకు ధీటైనా విద్యాప్రమాణాలకు సరిపడా ఇటువంటి పుస్తకాలు రచించారని అన్నారు. దీనిద్వారా ప్రయోగాత్మక విద్యను అందించాల్సిన అవుసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాస రావు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వి.అశోక్‌కుమార్, సహా యాధిపతి డాక్టర్ ఎం.ఎస్.ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కర్మయోగి'పై అవగాహన

కొత్తూరు: స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో కర్మయోగి అభియాన్‌పై గిరిజన యువకులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు డైరెక్టర్ బి.సంజీవరావు మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం సర్వే చేపడుతుందన్నారు. ఇందులో ఇళ్లు, పింఛన్లు, అంగన్వాడీ, రోడ్లు, రెవెన్యూ, ఫారెస్టు భూములు, పంటలు, గ్యాస్, వ్యవసాయ పనిముట్లు, రేషన్ కార్డులు, జాబ్‌కార్డులు వంటివి సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ క్రాంతికుమార్, ఏరియా కో ఆర్డినేటర్లు గోపాల్, వెన్నెల, నాగేశ్వర రావు, ఎస్.ఆనంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెప్మా పీడీ వెంకటరావు

పల్లెలు దేశ ప్రగతి పునాదులు

శ్రీకాకుళం సిటీ: ప్రతి మనిషి శరీరం, మనసు, తెలివితేటలు, ఆత్మ సమన్వయంతోనే సమగ్ర మానవతావాదం సాధ్యమని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించారని మెప్మా పథక సంచాలకులు ఎస్.వెంకటరావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్ శ్రీకాకుళం సౌజన్యంతో ప్రభుత్వ ఐటిఐలో గురువారం నిర్వహించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ఆలోచనలు గ్రామాభివృద్ధికి మార్గదర్శకమని, వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థతో పాటు స్వావలంబన, కల, ఆర్థిక వ్యవస్థలు దేశ ప్రగతికి పునాది వంటివన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు, యువజన సర్వీసులు శాఖ సూపరింటెండెంట్ ఎల్.రేఖ, స్పందన వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పి.కృష్ణారావు, లైఫ్ ఫ్యూయల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్.సత్య నారాయణ, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ దూసి సంతోష్, మేరాయువ భారత్ వాలంటీర్లు ప్రియాంక, గార మౌనిక, గుండ వసంతలక్ష్మి పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన రోడ్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నిర్వహణ అధ్వానంగా ఉంది. రోడ్డు మరమ్మతులకు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. సింహద్వారం నుంచి, కింతలి మిల్లు, బైపాస్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇసుక మేటలు నవభారత్ సమీపంలో రోడ్డుపై దర్శనమిస్తున్నాయి.

కొయిరాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

కింతలిమిల్లు సమీపంలో సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు

ఫరీదుపేట కూడలి, కొయిరాల వద్ద సర్వీస్ రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చే చర్యలు అధికారులు తీసుకోవటం లేదు. దీంతో సర్వీసు రోడ్డు సమస్యల రోడ్డుగా మారుతుంది. కేశవరావుపేట సమీపంలోని కింతలిమిల్లు సమీపంలో రోడ్డుపై నీరు నిలిచిపోతుంది. రోడ్లు సమస్యగా మారుతున్నాయి. నిర్వహణ లేకపోడం ప్రధాన సమస్యగా మారింది.

మహిళలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సోంపేట

స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బారువ వైద్యాధికారి దుర్యోధన అన్నారు. మండలంలోని బారువాలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వైద్య సేవలపై వివరించారు. ఆరోగ్యవంతమైన మహిళ ఉంటే శక్తివంతమైన కుటుంబంగా ఉంటుందన్నారు. ఎంపిడిఒ ఈశ్వరమ్మ, డాక్టర్ జి.హేమంత్ కుమార్, ఫిజియోతెరఫీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డెంటల్ సర్జన్ కృష్ణకుమార్, డాక్టర్ సౌజన్య, స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ ఇన్‌ఛార్జి దున్న శ్రీనివాసరావు, దున్న సోమశేఖర్ పాల్గొన్నారు.

లావేరు: మండలం గురుగుబిల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో లావేరు పిహెచ్‌సి వైద్యాధికారి డా.జె.మౌనిక ఆధ్వర్యంలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మౌనిక రక్తపోటు, హిమోగ్లోబిన్, మధుమేహం, క్షయ వ్యాధి, సికెల్ సెల్, కేన్సర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సేవలను ఉపయోగించుకొని ఆరోగ్య వంతమైన కుటుంబంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, ఎఎన్ఎం భవాని, ఎంఎల్‌హెచ్‌పి నారాయణమ్మ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలో కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్వస్త్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 220 మందికి బిపి, షుగర్, రక్తహీనత వంటి పలు రకాల పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.శివశంకర్, డా.నవీన్, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, కూటమి నాయకులు బలగ శంకర భాస్కరరావు, కండాపు శ్రీనివాసరావు, జామాన అప్పల నాయుడు, రామారావు, అప్పల నాయుడు, శేషగిరి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి దుర్యోధన

పొందూరు : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివశంకర్

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కొత్తూరు : పాతపట్నంలో రైతులు పండించే ఉత్పత్తులు, పంటలు నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. విజయవాడలోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఛాంబర్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈయన వెంట వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, శ్రీరామ్, సామాజిక వేత్త బి.రాజు ఉన్నారు.

సన్మానిస్తున్న కమిషనర్ రమేష్

రఘుబాబుకు సన్మానం

ఇచ్ఛాపురం : ప్రపంచ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా బెల్లుపడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఫార్మసీ ఆఫీసర్ రఘుబాబుకి కమిషనర్ రమేష్ గురువారం ఘనంగా సన్మానించారు. రఘుబాబు అందించిన సేవలు ప్రశంసించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్ర రెడ్డి, డాక్టర్ నీలిమ, డాక్టర్ గౌతమి, డాక్టర్ అఖిల్ మోహన్, ఎచ్‌డిఎస్ చైర్మన్ విజయ్ పాల్గొన్నారు.

సొంత నిధులతో చెరువు పనులు

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడ, త్రినాథపేట కాలనీ వద్ద ఉన్న అమ్మోరు చెరువు మరమ్మతులకు పాలకులు, అధికారులు ముందుకు రాలేదు. దీంతో రైతులు సొంత డబ్బులు వెచ్చించి చెరువు పనులు గురువారం చేపట్టారు. అందరికీ ఉపయోగ పడే అమ్మోరు చెరువులో ఉన్న పిచ్చి మొక్కలను ప్రొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. గిన్ని రంగయ్యరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

లోక్ కళ్యాణ్ మేళా

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో లోక్ కళ్యాణ్ మేళాను మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవి మాట్లాడుతూ ప్రభుత్వం వీధి వ్యాపారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న లోక్ కళ్యాణ్ మేళాను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారులను వెండింగ్ జోన్లుగా విభజించి కేటాయించిన ప్రదేశాల్లోనే వ్యాపారం చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే వీధి వ్యాపారులకు పిఎం స్వానిధి యోజన కింద బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకే రుణాలు అందించే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులను అందజేసి మెడికల్ క్యాంపు నిర్వహించారు. హాజరైన వారందరికీ డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, టిడిపి సీనియర్ నాయకులు మొదలవలస రమేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.రవికుమార్ ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ పి.కామేశ్వరరావు, డిసిసి బ్యాంకు మేనేజర్ మురళీధర్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ డి.సురేష్, టిఎంసి ఎస్.వి.రత్నం, సిఒలు నాగమణి, వినోద్, ఆర్‌పిలు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న సెర్ప్ సిబ్బంది

మృతుని ఫొటోతో నిరసన తెలుపుతున్న కుటుంబసభ్యులు

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

'నా కుమారుడు మువ్వల నాగేష్ రణస్థలం పోలీస్ స్టేషన్ సమీపంలో నాలుగున్నర ఏళ్ల క్రితం సగం కాలిన మృతదేహంతో కనిపించారని, ఇప్పటి వరకు మృతికి గల కారణాలు వెల్లడించలేదని, తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని' మండలంలోని నువ్వలరేవుకు చెందిన మృతుడి తల్లి సుందరి, కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఆమె ఇంటి ముందు కుమారుడు ఫొటోతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగేష్ చిలకపాలెంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో 2021 జనవరి 25న ఇసిఇలో చేరాడని తెలిపారు. 27న మృతి చెందినట్టు జె.ఆర్.పురం పోలీసులు చెప్పారని వాపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోస్టుమార్టం వివరాలు వెల్లడించలేదని రోదించారు. ప్రభుత్వం స్పందించి తన కుమారు మృతిపై విచారణ వేగంతం చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో సుందరాడలో గురువారం నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ సోమేశ్వరరావు, సిబ్బంది సంపత్‌రావు, రమేష్, మీనాక్షి, చలపతి, గణపతి, చిరంజీవి, జిన్నా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లకు...

కొక్కెర వ్యాధి వల్ల దేశవాళీ కోళ్లలో మృతి శాతం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల కొక్కెర వ్యాధి నివారణ టీకాలు దేశవాళీ కోళ్లకు తప్పనిసరిగా వేయించుకోవాలని కరుణాకరరావు అన్నారు. మండలంలో సుందరాడ పంచాయతీలోని కుర్మన్నపేటలో కొక్కెర వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి గురువారం తప్పనిసరిగా పశు వైద్య కేంద్ర పరిధిలోని ఈ టీకాలు వేస్తున్నామని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరుణాకరరావు

మాట్లాడుతున్న ఎంపిడిఒ వాసుదేవరావు

త్వరితగతిన పి-4 సర్వే

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో చేపడుతున్న పి4 సర్వేను ఈనెల 30లోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పి4పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బంగారు కుటుంబాల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం రమణమూర్తి, ఇఒ కింతలి మోహన్‌బాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎస్‌పి బాలుకి నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సోదవరం హేమలత స్మారక సంస్థ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం వద్ద చిత్రకారుడు సోదవరం ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. భారతీయ హ్యూమన్స్ రైట్స్ కౌన్సిల్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ చిత్రకారుడిగా, గాయకుడిగా సేవలందిస్తున్న ఈశ్వరరావు ఆధ్వర్యంలో గాయనీ, గాయకులకు పరిచయం చేయడం, పోటీలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కొత్తూరు

ఈ నెల 27న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు బెక్కిలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ పనులు నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన కొత్తూరు, కర్లెమ్మ, మహాసింగి, కుంటిభద్ర, సిరుసువాడ, పారాపురం, వసప కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కవిటి: మండలంలోని బొరివంక, మాణిక్యపురం 11కెవి, 11కెవి ఆర్‌డబ్ల్యుఎస్ ఫీడర్లలో ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక సబ్ స్టేషన్ పరిధిలోని బొరివంక, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, కుసుంపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రోన్‌తో జిల్లేడు ద్రావణం పిచికారీపై అవగాహన

రణస్థలం రూరల్: జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్ కంబపు ఒబ్బన్న ఆధ్వర్యంలో మండలం తెప్పలవలస యూనిట్ నీలంపేట గ్రామంలో రైతు దుంగ ఒబ్బన్న 12 ఎకరాల విస్తీర్ణంలో వరి పొలంలో ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసిన జిల్లేడు ద్రావణం, ద్రవజీవామృతం డ్రోన్ సహాయంతో గురువారం స్ప్రే చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జిల్లేడు ద్రావణం, ద్రవ జీవామృతం స్ప్రే చేయడం వల్ల చేను నల్లగా మారుతుండంతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. మొక్కకు నత్రజని, భాస్వరం, పోటాషియం ఎక్కువ శాతం అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ యూనిట్ ఇన్‌ఛార్జి చిగిలిపెల్లి వెంకటరమణ, కార్యకర్తలు వరలక్ష్మి, సత్యనారాయణ, అంజలి, రైతులు పాల్గొన్నారు.

హలోతో.. సహాయం పొందండి

నిస్సహాయ స్థితిలో, అత్యవసర పరిస్థితుల్లో చేతిలో ఉన్న ఫోన్‌లో ఒక్క హలో అనే మాటతో పూర్తిస్థాయిలో తక్షణ సహాయం పొందవచ్చును.

ప్రజాశక్తి- బూర్జ

మనము ఆపదలో ఉన్న సమయంలో అత్యవసర సేవలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం పలు విభాగాలకు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్లు అమల్లోకి తీసుకువచ్చింది. 24 గంటలు మీ సేవలో అందుబాటులో ఉంటాయి. ఫోన్ చేసి హలో అనగానే సిబ్బంది తక్షణ సహాయం అందజేస్తారు. కొన్నిసార్లు ఆపద సంబంధించిన పరిస్థితుల్లో చుట్టుపక్కల ఎవరూ లేకపోయిన పరిస్థితి తలెత్తిన సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్‌చేసి సమస్య చెబితే చాలు భరోసా కల్పిస్తారు.

1098 : మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, బాల కార్మికుల గుర్తింపు, అక్రమ రవాణా, చిన్నారులు (డ్రగ్స్) మాదక ద్రవ్యాలకు అలవాటు పడినప్పుడు 1098కు తెలియజేయవచ్చు. వెంటనే చైల్డ్‌లైన్ అధికారులు రంగంలోకి దిగి ఆపదలో ఉన్న బాలలకు రక్షణ కల్పించి సహాయం అందజేస్తారు.

101: గ్యాస్ లీకేజీ, బోరు, బావిలో ప్రమాదాలు, నీళ్లల్లో మునిగిపోయిన ఇల్లు, దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లో ఇలా ఏవిధమైన అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఈ టోల్ ఫ్రీ నెంబరకు ఫోన్ చేయగానే తక్షణమే స్పందించి సహాయం అందజేస్తారు.

1930: సైబర్ నేరాల నుంచి రక్షణ పొందడానికి ఈ నెంబర్ సహాయ పడుతుంది. బ్యాంక్ ఖాతా నుంచి నగదు పోయినా, డిజిటల్ అరెస్టుతో బెదిరించినా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మోసగించినా ఈ నెంబర్‌కు ఫోన్ చేస్తే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఖాతాలోని నగదు చేతులు మారకుండా స్పందిస్తారు.

112: ఆపదలో ఉన్న సమయంలో ఈ నెంబర్‌కు ఫోన్‌చేస్తే పోలీసులు సేవలు అందిస్తారు. తక్షణమే ఫిర్యాదు స్వీకరించి వెంటనే సమీప ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తారు. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి రక్షణ కల్పిస్తారు.

1073 : ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చడానికి ఈ నెంబర్ సహాయ పడుతుంది. ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎదురైతే అక్కడ పోలీసులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరిస్తారు.

1912 : విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ఈ నెంబర్‌కు చెప్పవచ్చు. సేవల్లో అంతరాయం కలిగినా, వీధి దీపాలు వెలగక పోయినా, విద్యుత్ సమస్య తలెత్తినా ఈ నెంబర్‌కు చేయగానే తక్షణమే స్పందించి పరిష్కరిస్తారు.

108 : ఎటువంటి ఆరోగ్య సమస్య ఉన్నా ఈ నెంబర్‌కు ఫోన్‌చేస్తే వెంటనే ఈ వాహనం ద్వారా సమీప ఆస్పత్రులకు చేర్చి వైద్యసహాయం అందజేస్తారు.

104 : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వారి చెంతకే వెళ్లి వైద్య సేవలను అందించేందుకు వీలుగా 104 వాహనం ద్వారా ప్రభుత్వ ఏర్పాటు చేసింది. ఇంకా ప్రభుత్వం మరెన్నో సేవలను అందజేస్తుంది.